సాక్షి చిత్తూరు

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



సంయుక్త ఆనందం!

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి సంయుక్త మీనన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు.



శోభాయమానం.. చందన స్వరూపం

కాణిపాకం/యాదమరి : తమిళ ఉగాదిని పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	23
తిరుపతి	41	24
తిరుమల	36	19
గూడూరు	41	26
నగరి	41	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.29	4.39
చిత్తూరు	6.31	4.39
పుంగనూరు	6.32	4.42

న్యూస్‌రీల్

బాబు, చినబాబు కులమతాలను ఎన్నడూ గౌరవించింది లేదు

- నారా లోకేష్ పిల్లబిత్రే
- ఎప్పుడు ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదు
- మంత్రి ఆర్‌కే రోజా



చిత్తూరు కలెక్టరేట్ : చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఏనాడూ కులాలను, మతాలను గౌరవించింది లేదని మంత్రి ఆర్‌కే రోజా విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దర్గా సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కనీస జ్ఞానం లేకుండా నోటిక ఏదొస్తే అది మాట్లాడే వారిని పల్లెల్లో పిల్లబిత్రే అంటారనీ.. నారా లోకేష్ కూడా అలాంటి వారే అని అభివర్ణించారు. ఆయన ఎప్పుడు ఏం మాట్లాడతారో ఆయనకే అర్థం కాదన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కు ఎవరి మీద గౌరవం లేదన్నారు. వారికి కుటుంబం, రాజకీయ భవిష్యత్తు, సంపాదనపై మాత్రమే గౌరవం ఉందని ఎద్దేవా చేశారు. సంక్షేమం, అభివృద్ధి కోసం వారు ఏనాడూ పనిచేసింది లేదన్నారు. దేశంలో అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని వర్గాలు కలిసికట్టుగా జీవిస్తున్నారంటే అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లేనని చెప్పారు. ఏపీలో మాత్రమే అంబేడ్కర్ ఆశయాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అన్ని కులాల వారికి, మహిళలకు పారదర్శకంగా అందుతున్నాయని చెప్పారు.

ఏనుగుల బీభత్సం

ఐరాల : మండలంలోని వినాయకపురం ఎస్టీ కాలనీ వద్ద గురువారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గణేష్ అనే రైతుకు చెందిన మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. డ్రిప్ పైపులు, బోర్ పైపులను తొక్కి ధ్వంసం చేశాయి. గంగయ్య అనే రైతుకు చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి, పూరి గుడిసెను ధ్వంసం చేశాయి. గుడిసెలో ఉన్న నిత్యావసర వస్తువులను ఆరగించాయి. అలాగే వేణుగోపాల్‌కి చెందిన మామిడి చెట్లను విరిచేసి, గేట్లను ధ్వంసం చేశాయి. మరో రైతు రంగనాథం ఇంటి పక్కన ఉన్న మొక్కజొన్న పంటను తొక్కి నాశనం చేశాయి. మోహన్‌రెడ్డికి చెందిన మామిడి తోటకు ఏర్పాటు చేసిన రాతి కూసాలను కూలదోశాయి. సమాచారం అందుకున్న మండల అటవీ శాఖాధికారి జయశంకర్ వెంటనే గ్రామానికి చేరుకుని ట్రాకర్ సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించారు.

104లో పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 104 వాహనాల్లో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి పాసై హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు, డేటా ఎంట్రీ పోస్టులకు ఏదైనా డిగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఐరాల, గంగాధరనెల్లూరు, పెద్ద పంజాణి, పుంగనూరు, బైరెడ్డిపల్లె, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, గుడిపల్లె, వరదయ్యపాళెం, ఏర్పేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాల్లో ఖాళీలున్నాయని వివరించారు. ఆసక్తిగలవారు ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు తిరుపతి మధురానగర్‌లోని 104,108 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు బాధ్యతలు చేపట్టనున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : నూతన జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు శుక్రవారం తెలిపారు. ముందుగా శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన జిల్లాకు విచ్చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో జేసీ బాధ్యతల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నాటు.. ఘాటు

పలమనేరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కౌండిన్య అటవీప్రాంతంలో సారా స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు.. తమిళనాడు సరిహద్దులను అడ్డాగా చేసుకుని నాటును ఘాటెక్కిస్తున్నారు.. దట్టమైన ఫారెస్ట్‌ను అవకాశంగా మలుచుకుని యథేచ్ఛగా సారా కాస్తున్నారు.. అడవిలోని రాతి గుహలనే ఆవాసాలుగా మార్చుకుని వ్యవహారం నడిపిస్తున్నారు.. ఇక్కడి బట్టీల్లో తయారుచేసిన సారాను వివిధ మార్గాల్లో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు.. కూలి సొమ్ముకు ఆశపడి పలువురు స్థానికులు సైతం వీరికి సహకరిస్తున్నారు.. మందీమార్బలంతో పేట్రేగిపోతున్న అరవ స్మగ్లర్లను అడ్డుకునేందుకు అటు అటవీశాఖ.. ఇటు ఎక్సైజ్‌శాఖ అధికారులు కూడా వెనకడుగు వేస్తున్నారు.

- సారా తయారీ కేంద్రంగా కౌండిన్య ఫారెస్ట్
- సరిహద్దు ప్రాంతంలో ఎక్కడ చూసినా బట్టీలే!
- తమిళనాడు ఎక్సైజ్ అధికారుల అండతో రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- జాయింట్ ఆపరేషన్‌తో దాడులు చేస్తున్నా బెదరని వైనం



అరట్ల వద్ద అడవిలో సారా స్థావరాలపై దాడి చేస్తున్న అధికారులు (ఫైల్)

పలమనేరు : కౌండిన్య అటవీప్రాంతంలో తమిళనాడు సరిహద్దుల వద్ద భారీగా నాటు సారాను తయారు చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో సుమారు పదేళ్లుగా సారాను కాస్తున్నప్పటికీ తమిళ స్మగ్లర్లను అధికారులు కట్టడి చేయలేకపోతున్నారు. ఇక్కడి స్థావరాలపై స్థానిక ఎక్సైజ్, సెబ్, పోలీస్, ఫారెస్ట్, స్పెషల్‌పార్టీ టాస్క్‌ఫోర్స్ తదితర శాఖలు తమిళ ఎక్సైజ్ అధికారులతో కలసి సంయుక్తంగా దాడులు చేసినా స్మగ్లర్లు బెదరడం లేదు. ఈ ప్రాంతం రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న దట్టమైన అడవి కావడం వారికి అనుకూలంగా మారింది.

పేర్నాంబట్ గ్యాంగ్ హల్‌చల్

పలమనేరు మండలంలోని దొమ్మరపాపమ్మ గుడి, కాలువపల్లె, మండీపేట కోటూరు, చెత్తపెంట, బైరెడ్డిపల్లె మండలంలోని ఓటేరుపాళ్యం, నల్లగుట్లపల్లె, బాపలనత్తం గ్రామాలు కౌండిన్య అడవికి సమీపంలో ఉన్నాయి. ఈ గ్రామాల నుండి 9 కిలోమీటర్ల లోపే తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ఉంది. ఇది దట్టమైన అడవికావడంతో సారా తయారీకి సురక్షితమైన చోటుగా తమిళ స్మగ్లర్లు ఎంచుకున్నారు. అరట్లకు 7 కిలోమీటర్ల దూరంలో సారా బట్టీలున్నట్టు తెలిసింది. తమిళనాడుకు చెందిన పేర్నాంబట్ గ్యాంగ్ అక్కడ మకాంవేసి ఈ ప్రాంతంలోని ప్రజలను సారా తయారీకి కూలీలుగా వాడుకున్నట్టు తెలుస్తోంది. గతంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముమ్మరంగా దాడులు చేయడంతో పేర్నాంబట్ గ్యాంగ్ వ్యవహారాలు ఆగాయి. మళ్లీ ఆరునెలల నుంచి సారా తయారీ మొదలైనట్లు అడవిలోకి వెళ్లే స్థానికులు చెబుతున్నారు.

కొందరికి ఇదే జీవనోపాధి

అటవీ ప్రాంతవాసులకు సారా తయారు చేయడమే జీవనోపాధిగా మారింది. రోజుకు రూ.500 కూలీ, మాంసాహారం, సారా ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇక సరుకు రవాణా చేయడం కోసం గాడిదకు రోజుకి రూ.300 ఇస్తుండడంతో పలువురు యువకులు అడవి బాట పడుతున్నారు. సంబంధిత గ్రామాల్లో సారా తయారీకి వినియోగించే బెల్లంతో పాటు ముడిసరుకులు సులభంగా దొరుకుతున్నాయి. ఇక తుమ్మ చెక్క అయితే కౌండిన్య అటవీప్రాంతంలో సమృద్ధిగా లభిస్తోంది.

రాతిగుహలే అడ్డా

దట్టమైన అడవిలో కొంతమేర ఎక్కడ చూసినా సారా బట్టీలే దర్శనమిస్తున్నాయి. ఎటుచూసినా కుండల్లో తుమ్మచెక్కను వేసి భూమిలో పూడ్చి బెట్టి కనిపిస్తుంటాయి. అడవిలోని చెరువులు, వాగులు, నీటి కొలనులకు ఆనుకొని బట్టీలున్నాయి. అక్కడక్కడా వున్న రాతి గుహలనే స్మగ్లర్లు అడ్డాగా చేసుకుని తమ వస్తువులను భద్రపరుచుకుంటున్నారు. సారాను పాత టూబుల్లో నింపి అక్కడే నిల్వ చేసుకుంటున్నారు. ప్రమాదకరమైన రాతి గుహల వద్దకు బయటివ్యక్తులు ఏమాత్రం వెళ్లలేని పరిస్థితి ఉంది.





సారా తయారీ కోసం కౌండిన్య అటవీప్రాంతంలో నిల్వ చేసిన తుమ్మచెక్క ఊట, ఇతర సామగ్రి (ఫైల్)

తమిళనాడుకు సరుకు రవాణా



కౌండిన్యలోని రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం

కౌండిన్య అటవీప్రాంతంలో తయారైన సారాను ట్యూబ్‌లలో నింపుకుని స్కూటర్లు, గాడిదలపై తమిళనాడుకు తరరలిస్తున్నారు. అడవి మార్గంలోనే అరట్ల వరకు తీసుకువెళ్లి, అక్కడినుంచి పేర్నాంబట్, గుడియాత్తం తదిర ప్రాంతాలకు చేరుస్తున్నట్లు తెలిసింది. తమిళనాడు అటవీ సరిహద్దులో బట్టీలు పెట్టినా సరుకు రవాణా మాత్రం జిల్లా సరిహద్దుల ద్వారానే చేపట్టాల్సి ఉంది.

జంకుతున్న స్థానికులు

మేకలు, పశువులను కాపరులు అడవిలోకి తోలుకెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. పొరబాటున సారా తయారు చేసే ప్రాంతానికి వెళితే బెదిరింపులు తప్పడంలేదు. దీంతో అడవిలో పొగ కనిపిస్తే చాలు, ఆ ప్రాంతం ఛాయలకే వెళ్లడంలేదు.

తమిళ అధికారుల కుమ్మక్కు?

జిల్లా ఎక్సైజ్ అధికారులు ఆ ప్రాంతంలో దాడి చేయాలంటే తమిళనాడుకు చెందిన ఎక్సైజ్ అధికారులు సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్మగ్లర్లతో కుమ్మక్కై సారా రవాణాకు తోడ్పాటు అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో మన లిమిట్స్‌లో సారాను తరలిస్తుండగా పట్టుకోవడం మినహా బట్టీల వద్దకు వెళ్లేందుకు వీలుగాని పరిస్థితి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి టాస్క్‌ఫోర్స్‌తో భారీగా సిబ్బందిని వెంటబెట్టుకుని వెళ్లినా తమిళ అధికారులు ముందస్తు సమాచారం అందించి స్మగ్లర్లను అప్రమత్తం చేస్తున్నారని తెలుస్తోంది.

కట్టుదిట్టంగా నిఘా



సరిహద్దు అడవిలో సారా తయారీ కేంద్రాలపై ఇప్పటికే పలుదఫాలు దాడులు చేశాం. అయితే ఈ ప్రాంతం తమిళనాడు, ఏపీకి సరిహద్దుగా ఉంది. ఇదే దాడులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. త్వరలోనే సారా తయారీ ముఠా గుట్టురట్టు చేసేందుకు కట్టుదిట్టంగా నిఘా పెట్టాం.

– ఎల్లయ్య, సెబ్ సీఐ, పలమనేరు

అడవిలోకి వెళ్లాలంటే భయం



మా గ్రామంనుంచి కౌండిన్య అడవిలోకి పశువులు, మేకలను మేపేందుకు వెళుతుంటాం. అయితే తమిళనాడు సరిహద్దులోని అడవిలో సారా చేస్తుండడంతో ఆ దరిదాపుల్లోకి వెళ్లాలంటే అందరికీ భయమే. సారా బట్టీల నుంచి వచ్చే పొగ కనిపిస్తే ఆప్రాంతంలోకి అసలు వెళ్లం.

– మోహన్‌రెడ్డి, చింతలగుంట, బైరెడ్డిపల్లె మండలం

సెబ్ అధికారులతో చర్చిస్తాం



నేను ఈ మధ్యనే ఇక్కడ విధుల్లో చేరా. ఈ ప్రాంతంలోని పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నాం. స్థానిక సెబ్ అధికారులతో చర్చించి సారా బట్టీలపై దాడులు చేస్తాం. ఉన్నతాధికారుల సహకారంతో సారా స్మగ్లర్లకు చెక్ పెడతాం. ముందు స్థానికులు ఎవరూ అడవిలో సారా తయారీకి వెళ్లకుండా అవగాహన కల్పిస్తాం.

– నయీమ్‌అలీ, ఎఫ్‌ఆర్‌ఓ, పలమనేరు

ఆదర్శనీయులు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి. ఎంపీ రెడ్డెప్ప



నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

- ఘనంగా బాబా సాహెబ్ జయంతి
- రాజ్యాంగ నిర్మాత సేవలను కొనియాడిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయులని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. శుక్రవారం చిత్తూరులోని దర్గా సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబా సాహెబ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అంబేడ్కర్ నిరుపేద కుటుంబంలో జన్మించినా, కష్టపడి ఉన్నతస్థానాలకు ఎదిగారన్నారు. రాజ్యాంగాన్ని రచించి దేశానికి బహుమతిగా అందించారని తెలిపారు.



పూలమాలవేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ఆయన ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. మంతి రోజా మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలు అనన్యసామాన్యమన్నారు. ఆయన నిర్దేశించిన మార్గంలోనే సీఎం జగనన్న పయనిస్తున్నారని తెలిపారు. రాజకీయ పదవుల కేటాయింపుల్లో సైతం సామాజిక న్యాయం పాటిస్తున్నారని వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అత్యున్నత విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ చిరస్మరణీయులని కొనియాడారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల వల్ల బడుగు బలహీన వర్గాలకు మేలు చేకూరుతోందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, విదేశీ విద్య ప్రభుత్వ సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి, మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డీఆర్‌ఓ రాజశేఖర్, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, దళిత సంఘాల నాయకులు తోట గోవిందన్, మునస్వామి, రాజ్‌కుమార్, ఎల్లప్ప, వినాయకం, దేవరాజులు పాల్గొన్నారు.

బాబు విస్మరించారు..
జగనన్న జీవితం ఇచ్చారు



టీచర్ పోస్టింగ్ పొందిన తిప్పయ్య

శాంతిపురం : ''ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలన్నది నా కల. ఇదే ఆకాంక్షతో కష్టపడి చదివి 1998లో డీఎస్సీ రాశా. జిల్లా నుంచి 3వేల మంది పోటీపడితే 120వ ర్యాంకు సాధించా. అయితే సాంకేతిక కారణాలతో ఉద్యోగం ఇవ్వలేదు. విద్యార్థి దశ నుంచే టీడీపీకి కార్యకర్తగా విశేష సేవలందించా. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నేరుగా చంద్రబాబుకే పలుమార్లు మొరపెట్టుకున్నా. అయినా కనికరం చూపలేదు. దీంతో గవర్నమెంట్ టీచర్‌పోస్టుపై ఆశ వదులుకున్నా. ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఈ క్రమంలో పరీక్ష రాసిన పాతికేళ్ల తర్వాత దేవుడు జగనన్న రూపంలో కరుణించాడు. నా కలను సాకారం చేస్తూ 54వ ఏట పోస్టింగ్ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ఆయన రుణం తీర్చుకుంటా'' అని మొరసనపల్లెకు చెందిన జి.తిప్పయ్య ఆనందం వ్యక్తం చేశారు. శాంతిపురం మండలం నుంచి 1998 డీఎస్సీలో క్వాలిఫై అయిన ఇద్దరిలో తిప్పయ్య ఒకరు కాగా తుమ్మిశికి చెందిన మధుసూదన్ రెండోవారు. జిల్లా వ్యాప్తంగా అప్పట్లో 1,400 మంది వరకూ అర్హత సాధిస్తే నాటి ప్రభుత్వం కటాఫ్ మార్కులు తగ్గించి 3 వేల మందిని ఎంపిక చేసింది. తర్వాత ఓరల్ టెస్టుల పేరిట అడ్డగోలుగా అయిన వారికి మాత్రం ఉద్యోగాలు ఇచ్చి మిగతా వారిని వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టింది. డీఎస్సీ తర్వాత ఉద్యోగం కోసం ఎదురుచూసి, పోరాటం చేసి ఆశలు వదులుకున్న ఈ ఇద్దరూ ప్రత్యామ్నాయ మార్గాల్లో జీవితాలను గడుపుతున్నారు. తొలి నుంచి తెలుగుదేశం పార్టీ వీరాభిమాని అయిన తిప్పయ్య ఆ పార్టీ బూత్ కమిటీ కన్వీనర్‌గా, ఇతర పదవుల్లో ఉన్నారు. కనీసం తనకు రావాల్సిన ఉద్యోగం కోసం, తన లాంటి సహచరుల కోసం ఆ పార్టీ అధికారంలో ఉండగా తీవ్రంగా కృషి చేశారు. చంద్రబాబుతో సహా ప్రభుత్వంలో, పార్టీలో ఉన్న పెద్దల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఎట్టకేలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో వీరికి ఉద్యోగాలు వచ్చాయి. దీంతో తాము జన్మంతా జగనన్నకు రుణపడి ఉంటామని చెమర్చిన కళ్లతో ఉద్వేగంగా చెబుతున్నారు. తిప్పయ్య తిమ్మరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో, మధుసూదన్ కరేగానూరు స్కూలులో పోస్టింగులు పొందారు.

19 నుంచి పది మూల్యాంకనం

తిరుపతి అర్బన్: ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు పది మూల్యాంకనం ఉంటుందని జేసీ డీకే బాలాజీ తెలిపారు. వేసవి సెలవుల్లో పాఠశాలలకు సంబంధించి రెండో విడత నాడు–నేడు పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు పేదలకు ఇవ్వాలన్నారు. పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించిన డీఈవో వి.శేఖర్‌తోపాటు పలువురు అధికారులను ఆయన అభినందించారు. ముఖ్య ప్రణాళికాధికారి అశోక్‌కుమార్, డీఈఓ వి.శేఖర్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి జయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, తిరుపతి, శ్రీకాళహస్తి డీఎల్‌డీవోలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు సెల్ఫీ చాలెంజ్!

శ్రీరంగరాజపురం : మండలంలోని కొటార్లపల్లె వద్ద నిర్మిస్తున్న సాఫ్ట్‌వేర్ 'స్మార్ట్ డీవీ కంపెనీ' వద్ద డిప్యూటీ సీఎం నారాయణస్వామి సెల్ఫీ తీసుకుని చంద్రబాబుకు చాలెంజ్ విసిరారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశంలోనే గ్రామీణ ప్రాంతలో ఏర్పాటైన అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ స్మార్ట్ డీవీ అని చెప్పారు. కొత్తపల్లిమిట్ట సమీపంలో సుమారు 6 ఎకరాల్లో పది అంతస్తులతో నిర్మిస్తున్నారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి చొరవతో స్మార్ట్ డీవీ కంపెనీ జిల్లాలో తమ ప్రస్థానాన్ని ప్రారంభిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని సుమారు 6వేల మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా సంస్థను స్థాపిస్తున్నారని వెల్లడించారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా చంద్రబాబు సొంత జిల్లాకు చేసింది శూన్యమని విమర్శించారు. కొత్త కంపెనీలను తీసుకురావడం సంగతి దేవుడెరు, విజయా డెయిరీ, షుగర్ ఫ్యాక్టరీలను మూసివేశారని ఆరోపించారు. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో పాటు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందం రెడ్డి, సంస్థ సీఈఓ దీపక్ తాల సెల్ఫీ తీసుకున్నారు.



సెల్ఫీ తీసుకుంటున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సేవలను కొనియాడారు. ప్రజల ఆస్తులు, ప్రాణాల పరిరక్షణకు అగ్నిమాపక శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఫైర్ సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణకే కాకుండా, వరదలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పెట్రోల్‌బంకులు, పాఠశాలలు, పరిశ్రమలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం విధి నిర్వహణలో మృతి చెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ కరుణాకర్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో తమిళనాడు న్యాయమూర్తి



న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వినాయక స్వామివారిని తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుష్ప సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు.

28న వేద విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

తిరుపతి తుడా: యూజీసీ గుర్తింపు ఉన్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం సేవలు ఉత్తర భారత దేశంలోనూ విస్తరించాలని నిర్ణయించినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీన వేద వర్సిటీ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

రోడ్డుపైకొచ్చిన ఒంటరి ఏనుగు

- గుడియాత్తం రోడ్డులో గంటపాటు రాకపోకలకు అంతరాయం



మొసలిమడుగు వద్ద రోడ్డుపై ఒంటరి ఏనుగు

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు వద్ద పలమనేరు–గుడియాత్తం రహదారిపై శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఓ ఒంటరి ఏనుగు రోడ్డుపైకి వచ్చేసింది. దీంతో ఏనుగును చూసి రోడ్డుపై వాహనాలను దూరంగా ఆపేశారు. కొందరు ఆకతాయిలు ఏనుగు సెల్ఫీ కోసం ఎగబడ్డారు. గురువారం ఏటిగడ్డ గ్రామ సమీపంలో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు కౌండిన్య నదిని దాటి శుక్రవారం మెయిన్ రోడ్డుపైకి వచ్చినట్టు స్థానికులు తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకే దంపతులు బలి?

- ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- దర్యాప్తునకు ప్రత్యేక బృందం ఏర్పాటు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి



బావి నుంచి వెలికితీసిన మృతదేహాలు (ఫైల్)



మునీంద్ర(ఫైల్)

చౌడేపల్లె : మండలంలోని శెట్టిపేట పంచాయతీ ఎర్రగానిపల్లె వద్ద గురువారం వెలుగుచూసిన దంపతుల మృతదేహాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేటగాళ్ల ఉచ్చుకు వారు బలై ఉంటారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తాము ఏర్పాటు చేసిన విద్యుత్‌తీగలు తగిలి మృతి చెందిన భార్యాభర్తలను వేటగాళ్లే మూటగట్టి బావిలో పడేసి ఉంటారని వెల్లడిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు.. చుక్కావారిపల్లెకు సమీపంలోని గొనిచెర్వుకు చెందిన మునీంద్ర భీరమ్మ దంపతులు మామిడి తోటలకు కాపలాగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఏడాది క్రితమే వీరికి వివాహమైంది. ఈ నెల 9వ తేదీ రాత్రి నుంచి మునీంద్ర సెల్‌ఫోన్ పనిచేయకపోవడంతో ఎక్కడికైనా పనికి వెళ్లారేమో అని బంధువులు భావించారు. ఇంతలో మృతదేహాలుగా బయటపడడంతో దిగ్భ్రాంతి చెందుతున్నారు. సెల్‌ఫోన్ ఆధారంగానే మృతుల వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. మృతుడి అక్క సిద్దమ్మను ఘటనాస్థలానికి రప్పించి నిర్ధారించుకున్నారు.

రాళ్లు కట్టి బావిలో పడేశారు

మునీంద్ర, భీరమ్మను బెడ్‌షీట్‌లో చుట్టి, డ్రిప్ వైర్లతో మూటకట్టి, దానిపై రాళ్లపెట్టి బావిలో పడేసుండడంపై స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నగదు, బంగారం వారి వద్ద ఉండే అవకాశం లేదని, నిరుపేదలైన వారిని చంపడానికి కారణాలు ఏంటనే విషయంపై చర్చ సాగుతోంది. మరీ అంత దారుణంగా దంపతులను హత్య చేసే అవసరం ఎవరికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వన్యమృగాలను వేటాడే క్రమంలోనే..?

శెట్టిపేట, పందిళ్లపల్లె, చారాల, దుర్గసముద్రం తదితర గ్రామాలు అటవీప్రాంతాలకు సమీపంలో ఉన్నాయి. ఇక్కడి పొలాల వద్ద అడవిపందులు, దుప్పి తదితర జంతువులను వేటాడేందుకు పలువురు వేటగాళ్లు ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ తీగలను అమర్చి వన్యప్రాణులను చంపేసి యథేచ్ఛగా మాంసం విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పంట పొలాలకు చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు తగిలి దంపతులు మృతి చెందితే, ఇలా మూటగట్టి బావిలో పడేశారేమో అని అనుమానాలు వినిపిస్తున్నాయి. ఈ కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఎక్కడ విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేశారో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

చాలెంజ్‌గా తీసుకున్నాం : డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

ఎర్రగానిపల్లె వద్ద బావిలో బయటపడిన మునీంద్ర, భీరమ్మ హత్య కేసును ఛాలెంజ్‌గా తీసుకుని విచారణ చేస్తున్నామని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఘటనా స్థలాన్ని సీఐ మధుసూధనరెడ్డి, ఎస్‌ఐ రవికుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు.



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

విద్యార్థిని ఆత్మహత్య

పలమనేరు : మండలంలోని టి.వడ్డూరులో శుక్రవారం ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. మునివెంకటప్ప కుమార్తె కీర్తి(15) పెంగరగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ప్రస్తుతం పరీక్షలు రాస్తోంది. బాలిక తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో బాలిక ఇంట్లో ఎవరూ లేనప్పుడు దూలానికి ఉరివేసుకుని మరణించింది. విద్యార్థిని తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోందని, ఆ కారణంగానే బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబీకులు చెబుతున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన మినీ వ్యాను



తెలుగుగంగ ఉపకాలువలోకి దూసుకెళ్లిన మినీ వ్యాను

వరదయ్యపాళెం: వేగంగా వస్తున్న మినీ వ్యాను అదుపు తప్పి తెలుగుగంగ ఉపకాలువలోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైన ఘటన మండలంలోని కంచరపాళెం సమీపంలో చోటుచేసుకుంది. వాహనదారుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీఎన్ కండ్రిగ మండలం కరకంబట్టుకు చెందిన మునిరాముడు డ్రైవర్ మునెయ్యతో కలసి తనకున్న మినీ వ్యాను ద్వారా తిరుపతి నుంచి తమిళనాడు వేలచ్చేరికి ఓ యజమానికి చెందిన ఇంటి వస్తువులను తరలిస్తున్నాడు. సత్యవేడు మార్గంలోని కంచరపాళెం సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం తెలుగుగంగ మాంబట్టు ఉపకాలువలోకి వాహనం అదుపు తప్పి దూసుకెళ్లింది. దీంతో వాహనంలో ఉన్న యజమాని మునిరాముడు (45), డ్రైవర్ మునెయ్య (43)లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికుల సహకారంతో 108కు సమాచారమిచ్చి సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయుడి హఠాన్మరణం

పూతలపట్టు: మండలంలోని ఎర్ర చెరువుపల్లెకు చెందిన విజయేశ్వరరాయుడు(60) అనే ఉపాధ్యాయుడు శుక్రవారం గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన శనివారం పదో తరగతి పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు స్కూలుకు వెళ్లాడు. తిరిగి కారులో ఇంటికి వస్తూ మార్గం మధ్యలో నిలిపేశాడు. రోడ్డుపై వెళుతున్న వారు గమనించగా కారులో మృతి చెందినట్లు తెలిసింది. కొద్దిరోజులుగా విజయేశ్వరరాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పక్షుల కేంద్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు



పక్షుల కేంద్రంలో పార్కులోని జింకలకు పచ్చగడ్డి వేస్తున్న దృశ్యం



చెరువు కట్టపై వ్యూ పాయింట్ వద్ద సందర్శకుల కోసం షెడ్ ఏర్పాటు



కేంద్రంలోని అటవీ ప్రాంతంలో జింకల కోసం నీటి గుంత

దొరవారిసత్రం : విదేశీ వలస విహంగాల సంతానోత్పత్తి కేంద్రంగా బాసిల్లుతున్న నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సందర్శకుల సౌకర్యార్థం, పక్షులు, జింకల ఆవాసయోగ్యంగా స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వనవిహారి, కాంప పథకాల ద్వారా సుమారు రూ.10లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే పూర్తిచేశారు. నేలపట్టు గిరిజన కాలనీలో రూ.3లక్షల వ్యయంతో 12 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం పరిధిలోని అటవీ ప్రాంతంలో 500 జింకల వరకు సంచరిస్తున్న నేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఐదు ప్రాంతాల్లో వనవిహారి పథకం కింద రూ.5 లక్షలతో నీటి కుంటలు నిర్మించారు. ప్రస్తుతం ఈ కుంటల్లో వర్షపునీరు నిల్వ ఉంది. అదేవిధంగా చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద సందర్శకుల సౌకర్యార్థం మూడు ప్రాంతాల్లో ఒక్కొక్కటి రూ.85 వేలు వెచ్చించి షెడ్లు నిర్మిస్తున్నారు. ఇక్కడే పర్యాటకులు సేద తీరేలా 20 సిమెంట్ బెంచీలు సిద్ధం చేస్తున్నారు. త్వరితగతిన పనులు చేసేందుకు చర్యలు చేపట్టారు.



విడిది చేస్తున్న తెల్లకంకణాయిలు, నత్తగుల్ల కొంగలు

ఈ సీజన్‌లోనే అధికం



గతంలో ఎన్నడూ రానంత ప్రవేశ రుసుం ఈసీజన్‌లో (గత నెల మార్చి వరకు) రూ.15.4 లక్షలు వచ్చింది. ఈ నగదుతో పక్షుల కేంద్రంలో సందర్శకులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు వంటివి కల్పిస్తున్నాం. వేసవి అయినప్పటికీ ప్రత్యేకించి కేంద్రంలోని పార్కులో ఉన్న జింకల కోసం పచ్చిగడ్డితో పాటు దాణా, కూరగాయలను ఆహారంగా వేస్తున్నాం. ఈ నెలఖారిలోపు విహంగాలు వాటి సంతానంతో వెనుదిరికి ఆయా దేశాలు వెళ్లిపోతాయి.

– బి. వరప్రసాద్, ఎఫ్‌ఆర్‌ఓ, నేలపట్టు పక్షుల కేంద్రం

చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా దివాకర్‌రెడ్డి



జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు

- మేలో జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్

తిరుపతి ఎడ్యుకేషన్ : చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, తిరుపతి జిల్లా చైర్మన్‌గా తిరుపతికి చెందిన డాలర్స్ గ్రూప్ అధినేత డాలర్స్ దివాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆడడం ద్వారా ఏకాగ్రత, మేధో సంపత్తి పెంపొందుతుందన్నారు. కార్పొరేట్‌కు పరిమితం కాకుండా గ్రామీణ స్థాయిలోనూ చెస్ క్రీడను విస్తరించేలా ప్రణాళికలు రూపొందించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. చెస్ క్రీడ మరింత వ్యాప్తికి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడ్డ చెస్ క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెల తిరుపతిలో జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ.శర్మ, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి శ్రీనివాస్ సూరి, కోశాధికారి అమర్నాథ్, వివిధ జిల్లాల చెస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శోభాయమానం.. చందన స్వరూపం



సిద్ధి, బుద్ధి సమేతంగా ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు శుక్రవారం తమిళ ఉగాదిని పురస్కరించుకుని చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక అభిషేకం అలంకరణలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలు అన్నీ రద్దు చేశారు. ఉదయం నుంచి భక్తులకు బ్రేక్ లేకుండా దర్శనం కల్పించారు.

ఆలయంలో పుష్పసోయగం

తమిళ ఉగాదిని పురస్కరించుకుని ఆలయంలో ఉభయదారులు కాణిపాకానికి చెందిన రాజమాణిక్యం కుమారులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి ధ్వజస్తంభం, అన్వేటి మండపం , సుపథ మండపంలో పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు.



అన్వేటి మండపంలో విశేషాలంకరణ



ఆకట్టుకుంటున్న స్వామివారి ధ్వజస్తంభం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బైరెడ్డిపల్లె : పుంగనూరు–బైరెడ్డిపల్లె రహదారిలో లక్కనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ వెంకట నరసింహులు కథనం మేరకు... చిన్నచల్లారగుంట గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (45) బైరెడ్డిపల్లె నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. కొత్తయిండ్లు బస్‌స్టాప్ వద్ద బెల్లంమడుగు గ్రామానికి చెందిన మొగిలమ్మ (45), లక్కనపల్లె బస్‌స్టాప్ వద్ద పుంగనూరు మండలం బైరవమంగళం గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య గంగోజమ్మ తాము కూడా వస్తామని బైక్ ఎక్కారు. ముగ్గురూ ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో గంగోజమ్మ అక్కడికక్కడే మృతి చెందగా మొగిలమ్మ, సుబ్రమణ్యం తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్..



సుబ్రమణ్యం మృతదేహం

కుప్పంరూరల్ : మండలంలోని తంబిగానిపల్లె వద్ద శుక్రవారం ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. దళవాయికొత్తపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు సుబ్రమణ్యం (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ట్యాంకర్‌లో నీరు నింపుకునేందుకు ఓ బోరుబావి వద్దకు వెళ్లాడు. ట్యాంకులో నీరు ఎంత వరకు వచ్చిందని చూసేందుకు పైకి ఎక్కాడు. ఇంతలో ట్రాక్టర్ అదుపు తప్పి ముందుకు కదిలింది. అదుపు చేసేందుకు డ్రైవర్ సీటులోకి ఎక్కేందుకు యత్నిస్తూ వాహనం కింద పడిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గుండెపోటుతో ఎంపీడీఓ..

సత్యవేడు: స్థానిక ఎంపీడీవో బాలగణేశన్ గుండెపోటుతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన చిత్తూరులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున గుండెనొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఓ హాస్పిటల్ భార్యతో కలిసి వెళ్లారు. డాక్టర్ పరీక్షిస్తుంగా మరో మారు గుండెపోటు రావడంతో స్పృహకోల్పోయి మృతి చెందారు. ఎంపీడీఓ మృతిపట్ల ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ వీ.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పీ. విజయలక్ష్మి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు సంతాపం తెలిపారు.